క్లుప్తంగా

ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి

కాశినాయన : మండలంలోని కోడిగుడ్లపాడు పంచాయతీ ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్ కొనకొండు నరసయ్య (58) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, ఏపీఓ రాజమౌళి, ఈసీ నాగేంద్రప్రసాద్, టీఏ రామాంజనేయులు, మండలంలోని ఉపాధి సిబ్బంది నరసయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పోరుమామిళ్ల : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు మండల అధ్యక్షురాలు తహసిన్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌మెంబర్, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



కొలువుదీరిన సీతారామ విగ్రహాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి బొజ్జవారిపల్లెలో సీతారామాలయంలో గురువారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విగ్రహమూర్తులకు వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి విగ్రహ, ప్రాణప్రతిష్ట చేశారు. విగ్రహాలను మదనపల్లె పట్టణ సీనియర్ జడ్జి శిరీష్ సులక్షణలు అందజేశారు. పాల్గొన్న భక్తులకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ మాధవి, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఓబులేసు, మారయ్య, చెన్నయ్య, పుల్లయ్య, కేశవ, బి.ఓబులేసు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మడూరులో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ మండల పర్యవేక్షకులు వేల్పుల భాస్కర్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామస్తులకు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారన్నారు. అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉపాధ్యాయులకు శిక్షణ

పోరుమామిళ్ల : శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మవారిశాలలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, మానవతా విలువలపై ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనుభవజ్ఞులైన స్పీకర్స్ శిక్షణకు వస్తారన్నారు. శిక్షణకు వచ్చిన వారికి మెటీరియల్ ఇస్తామన్నారు. ఉదయం టిఫన్, మధ్యాహ్నం భోజనం ఉంటుందన్నారు.

వ్యర్థాలతో అనర్థాలు



వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సెక్షన్ ఆఫీసర్

అట్లూరు : వ్యర్థాలవలన అనార్థాలు కలుగుతాయని సిద్దవటం అటవీ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వి.సురేష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చింతువాండ్లపల్లె, అట్లూరు చెక్‌పోస్టు వద్ద వ్యర్థాల వలన కలిగే అనర్థాలపై చైతన్య కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి మాట్లాడారు. ఎక్కడా కూడా చెత్త వ్యర్థాలను పడేయరాదని ఆయా ప్రదేశాల్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఎస్‌బీఓలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: ఉత్తరప్రదేశ్ గౌతమబుద్ధ నగర్‌లోని గౌతమబుద్ధ యూనివర్సిటీలో జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కడప యోగివేమన విశ్వ విద్యాలయానికి చెందిన రవిశంకర్ 81 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. రవిశంకర్ సాధించిన విజయానికి యోగివేమన విశ్వ విద్యాలయం ఉపకులపతి, స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ అభినందించారు.

బాల కార్మికులను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వివిధ శాఖల సమన్వయంతో బాల కార్మికులను గుర్తించి పునరావాసం కల్పించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి తేదీల వారీగా తనిఖీ చేయాల్సిన ప్రాంతాలను సూచించామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని వివరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



రెడ్డివారిపల్లెలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులకు అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. గురువారం మండలంలోని రెడ్డివారిపల్లె, సిరిగిరిపల్లె, సిరిగిరిపల్లె దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల వివరాలను బుక్‌లెట్, కరపత్రాల ద్వారా తెలియజేశారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు, యువకులు, విద్యార్థులు, రైతుల సంక్షేమానికి అమలు చేసిన పథకాలతో విప్లవం సృష్టించారని, ఏడాదిలోనే 90 శాతం పైగా హామీలను పూర్తి చేశారన్నారు. సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ఇంటి వద్దకే పథకాలను అందజేశామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి మరోసారి ఆయనను సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు రామకోటి, వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, దుగ్గిరెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హుస్సేనయ్య, జయరామిరెడ్డి, రాజశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు విద్యాసాగర్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

దువ్వూరు : గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి కొరత, పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా రైతులకు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇటీవల గాలివానకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించిన ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డిని ఆయన అభినందించారు. నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రాజోలు పాదయాత్రకు అనుమతి ఇవ్వండి

ప్రొద్దుటూరు : రాజోలు ఆనకట్ట నిర్మాణం వద్దకు పాదయాత్రగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని రాజోలు జలాశయం సాధన సమితి గౌరవాధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి, అధ్యక్షుడు నీలకంఠారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతిపత్రమిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2.95 టీఎంసీల సామర్థ్యంతో రూ.291 కోట్లతో రాజోలు జలాశయం నిర్మించేందుకు శిలాఫలకం వేశారన్నారు. 2019లో రెండో మారు రూ.1357 కోట్లతో అంచనా వ్యయంతో పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. మూడేళ్లు దాటినా ఇంత వరకు జలాశయం పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. రాజోలు జలాశయం సాధన సమితి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ఈనెల 15, 16 తేదీల్లో పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించామని, ఇందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో కూడా మంచి మార్కులు సాధించాలన్నారు. కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. 590 మార్కులు సాధించిన శరణ్య, 571 మార్కులు సాధించిన నజహత్ నఫీజ్, 555 మార్కులు సాధించిన ఆయేష తదితరులను అభినందించారు ఉపాధ్యాయులు లక్ష్మినరసమ్మ, నాగార్జునరెడ్డి, ప్రభాకర్, గురవయ్య, లక్ష్మిదేవి, గీత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ శానిటరీ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: వార్డు సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీల అసోసియేషన్ పిలుపులో భాగంగా జిల్లా పరిషత్ ఆవరణంలో నిర్వహించిన సమావేశానికి ఆయన మద్దతు తెలిపారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి రోజుకు 10 నుంచి 14 గంటలు పనిచేయించుకోవడం దారుణమన్నారు. సంబంధం లేని పారిశుద్ధ్య పనులను అప్పగించి వాటికి మీరే బాధ్యులని చెప్పడం సరికాదన్నారు. సీడీఎంఏ ఇచ్చిన సెలవులన్నీ వీరికి తు.చ తప్పకుండా అమలు చేయాలని కోరారు.

శ్రీ లక్ష్మీనరసింహుని కల్యాణ వైభవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలోని మూలమూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు కూడా అభిషేకం చేసి వధూవరులుగా ప్రత్యేక అలంకారం నిర్వహించి ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అర్చక బృందం కల్యాణ కార్యక్రమాన్ని క్రమంగా నిర్వహించింది. కల్యాణ అనంతరం అందులో వాడిన తలంబ్రాలను భక్తులందరికీ ప్రసాదంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వారికి కల్యాణ భోజనాన్ని స్వామి, అమ్మవార్ల ప్రసాదంగా అందజేశారు.

చుక్కల భూముల చిక్కులు తొలగిపోయాయ్



చుక్కల భూములకు సంబంధించిన పత్రాలు పొందిన రైతులతో ఎమ్మెల్యే, ఆర్డీఓ

పెండ్లిమర్రి : ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ముగింపు పలుకుతూ చుక్కల భూముల చిక్కులకు శాశ్విత పరిష్కారం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల చిక్కులు తొలగించారు. దీంతో రైతన్నలకు భూమిపై భరోసా లభించిందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం చుక్కల భూముల చిక్కులకు శాశ్విత పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 2314 మంది రైతులకు సంబంధించి 3841 ఎకరాల చుక్కల భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం రైతులకు సంపూర్ణ హక్కును కల్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో 103 ఏళ్ల క్రితం భూ సర్వే జరిగినప్పుడు ప్రభుత్వ భూమి లేదా పట్టా భూమి అని నిర్ధారణ చేయకపోవడంతో రెవెన్యూ రికార్డులు(ఆర్ఎస్ఆర్)లో చుక్కలు పెట్టి వదిలేశారు. ఆభూములే చుక్కల భూములు అయ్యాయి. భూమిపై సంపూర్ణ హక్కులు లేక దశాబ్దాలుగా రైతులు ఆభూములును అనుభవిస్తున్నా వాటిని అమ్ముకునే స్వేచ్ఛ, సర్వ హక్కులు లేక ఇబ్బందులు పడ్డారు. సాగు చేసుకునే తమ భూములపై అధికారిక హక్కులు కల్పించాలని కాళ్లరిగేలా రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరిగారు. గత ప్రభుత్వాలు రైతుల సమస్యల గురించి పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ రైతుల సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపి రైతులకు మేలు చేయాలని చుక్కల భూములకు చిక్కులు తొలగించారన్నారు. అనంతరం రైతులకు చుక్కల భూములకు సంబంధించిన పత్రాలను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, మండల స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిరాక్స్ సెంటర్లను అధికారులు మూసి వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివ కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల దగ్గర జిరాక్స్ సెంటర్ల నుంచి లీకేజీ జరిగిన సంఘటనలు ఉన్నాయని అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి వాటిని మూసి వేయించాలని కోరారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

కమలాపురం : వీఎన్‌పల్లె మండలంలో ఈనెల 24వ తేదీ నుంచి జరిగే సీపీఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, పి.చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. గురువారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో సీపీఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు నన్నే, వరప్రసాద్, మేరీ, శంకర్ పాల్గొన్నారు.

చెన్నూరు తహసీల్దార్‌గా సరస్వతి

చెన్నూరు : మండల తహసీల్దార్‌గా సరస్వతి గురువారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఈమె పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తూ అక్కడినుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పఠాన్‌అలీఖాన్ కమలాపురం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నట్లు తెలిసింది. తహసీల్దార్ సరస్వతి కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులకు సంబంధించిన ఆన్‌లైన్, పాస్ పుస్తకాలు, భూ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని, అలాగే ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. గురువారం కర్నూలు జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. రాష్ట్రంలోని పాఠశాలలో పనిచేస్తునన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పార్ట్ టైం ఉద్యోగుల జీతాలను పెంచాలని కోరారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారుల సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ తెలిపారు.

వైఎస్ కుటుంబంపై టీడీపీ కుట్రలు

కడప కార్పొరేషన్: వైఎస్ కుటుంబంపై బురదజల్లడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ, ఎల్లోమీడియా కుట్రలు చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేస్తే కొన్ని టీవీ ఛానెళ్లు డిబేట్లు నిర్వహించి ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. చట్టాలు, న్యాయస్థానాలంటే వీరికి ఏమాత్రం గౌరవం లేదని తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ విచారణ చేస్తోందని, ఆ అంశాన్ని దానికి వదిలేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీని నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా చివరికి న్యాయం, ధర్మమే గెలుస్తాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విషయంలో రుజువయ్యిందని తెలిపారు. ఇకనైనా దుష్ప్రచారాలకు తెరదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిత్య, ఆరీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గౌరవం

కడప కల్చరల్ : తాను పనిచేస్తున్న సంస్థకు అంకిత భావంతో సేవలు అందించినపుడే ఆ ఉద్యోగికి, సంస్థకు కూడా గౌరవం ఉంటుందని ఆకాశవాణి, దూరదర్శన్ చెన్నై కేంద్రం (ఇంజనీరింగ్ విభాగం) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రంగస్వామి అన్నారు. ఆకాశవాణి కేంద్రం ఇంజనీరింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల శరత్‌బాబుల ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ గురువారం కడప హరిత హోటల్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినపుడే సంస్థతోపాటు ప్రజలు కూడా ఆ ఉద్యోగిని గుర్తించుకుంటారని, గౌరవిస్తారని తెలిపారు. ఆకాశవాణి కడప కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వీరభద్రుడు కూడా మాట్లాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారిని అతిథులు, అధికారులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



కాలువపల్లె స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గోపవరం : మండలంలోని కాలువపల్లె రెవెన్యూ పొలంలో భూ సమస్యలను పరిష్కరించాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గురువారం కాలువపల్లెలో మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజుతో పాటు అన్నిశాఖల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కొందరు రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతులు అందజేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో కాలువపల్లెలో భూ సర్వే నిర్వహించామని, హద్దులు ఏర్పాటు చేస్తున్నామని, ఇంకా భూ సమస్యలు ఉన్నట్లైతే వాటిని త్వరగా క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తామని రైతులకు తెలిపారు. అనంతరం వివిధ సమస్యలపై అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్, పీఆర్ ఏఈ చిట్టిబాబు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలి



కొండ్రాజుపల్లె చెరువు పనులను పరిశీలిస్తున్న అధికారులు

కాశినాయన : చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అబ్దుల్‌ఖాదర్, అగ్రికల్చర్ డీడీ చిన్నయ్యలు పేర్కొన్నారు. గురువారం మండలంలో అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా కొండ్రాజుపల్లె చెరువును వారు పరిశీలించి మాట్లాడారు. చెరువులను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. ఉపాధి కూలీలు సమయం పాటించి నాణ్యతతో పని చేయాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకుని పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ హనుమంతరాయప్ప, ఏపీఓ రాజమౌళి, ఈసీ నరేంద్రప్రసాద్, టీఏ రామాంజనేయరెడ్డి, ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ఏరువపాలెం సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సయ్యదున్నీసా

రాజుపాలెం : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా అన్నారు. మండలంలోని ఏరువపాలెం సచివాలయంలో గురువారం స్పందన కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో స్పందన కార్యక్రమం మండల స్థాయిలో సోమవారం ఒక్కరోజు మాత్రమే జరిగేదన్నారు. ప్రజలు ఇబ్బందులకు గురి కాకూడదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఒక్క సచివాలయం, గురువారం మరో సచివాలయంలో నిర్వహించాలని నిర్ణమించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఓ గంగయ్య, ఏఓ శివరామకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజరామమోహన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

రాజుపాలెం : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, వారి సేవలు అభినందనీయమని గాదెగూడూరు సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామంలోని సచివాలయంలో గురువారం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు కేటాయించిన 50 ఇళ్లలో ఎంతమంది ఏ పథకాలు లబ్ధిపొందారో సమాచారం ఉండాలని చెప్పారు. రాబోయే రోజుల్లో పనితీరు మెరుగుపడాలన్నారు. అనంతరం వలంటీర్లకు శాలువ కప్పి, పూలమాలలు వేసి ప్రశంశాపత్రాలను అందించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శిరీష, ఏఎన్ఎం రజియా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

విశ్వ విద్యాలయ ప్రతిష్ట పెంచేలా పనిచేద్దాం

వీసీ చింతా సుధాకర్




మాట్లాడుతున్న ఉపకులపతి చింతా సుధాకర్

కడప ఎడ్యుకేషన్: విశ్వ విద్యాలయం కీర్తి ప్రతిష్టలు పెంచేలా ప్రతి ఒక్కరం పనిచేద్దామంటూ వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ పిలుపునిచ్చారు. విశ్వ విద్యాలయ కుటుంబ సభ్యులంతా నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే వైవీయూను దేశంలోనే మొదటిస్థానానికి తీసుకువెళతామని అన్నారు. గురువారం విశ్వ విద్యాలయంలో పనిచేసే బోధనేతర సిబ్బందితో ఆయన స్థానిక సురభి సెమినార్ హాల్లో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో బోధనేతర సిబ్బందిలో 80 శాతం మంది డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత అర్హత కలవారు ఉండటం శుభ పరిణామం అన్నారు. విశ్వ విద్యాలయ విధానాలు రూప కల్పనలో మీ ప్రాత అంత్యంత కీలకమని అంతే బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని త్వరలోనే అమలులోకి తెస్తామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను నిబంధనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఇవ్వడానికి తాను సిద్ధమన్నారు. విశ్వ విద్యాలయ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

కమలాపురం : ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ పథక ఏపీడీ నాగరత్నమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద జరిగిన ఓపెన్‌ఫోరంలో ఆమె మాట్లాడారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక బృందం చేపట్టిన తనిఖీ గురించి, అందులో బయట పడిన అంశాలను సభ్యులు చదివి వినిపించారు. ఏడాది కాలంలో ఉపాధితో పాటు అనుసంధాన శాఖలకు సంబంధించిన 864 పనులకు రూ.59.10 కోట్లు ఖర్చు అయినట్లు వారు వివరించారు. ఇందులో వేతనాల రూపంలో రూ.32.62 కోట్లు, మెటీరియల్‌కు రూ. 26.5 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. సామాజిక బృంద సభ్యులు గత నెల 22వ తేదీ నుంచి గ్రామాల్లో పర్యటించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ పనుల్లో రూ.19,842 సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఏపీడీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే క్షేత్ర స్థాయి సిబ్బంది కూలీలకు రూ.272 వేతనం పడే విధంగా కొలతలు వేసి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున పాత కలెక్టరేట్



కడప కల్చరల్ : వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన పాత కలెక్టరేట్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కనుమరుగై చరిత్ర పుటల్లో ఒక జ్ఞాపకంగా మిగిలిపోయే రోజు వస్తుంది. కడప నగరంలోని పాత కలెక్టరేట్‌కు చెట్టుకొమ్మల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. భవనం చుట్టూ పెరుగుతున్న కొమ్మలు నిర్మాణాలను ఒరుసుకుంటూ ఉండడంతో అది దెబ్బతినే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నగరానికి పాత కలెక్టరేట్ గర్వకారణమైనదిగా నిన్నటి వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలిచి ఉంది. వందేళ్లు పైబడడంతో కలెక్టరేట్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత భవనం ఆలనా పాలన లేక రోజురోజుకు శిథిలమవుతోంది. ఈ ప్రాంతమంతా సమీపంలోని వారికి మూత్రశాలగా మారిపోయింది.పోలీసుస్టేషన్ సమీపంలోనే ఉండడంతో ప్రమాదాలకు గురైన వాహనాలు, కేసుల్లో తీసుకు వచ్చిన వాహనాలు ఇక్కడే ఉంచుతుండడంతో వాటి మధ్యన చెత్త పేరుకుని దుర్గంధానికి కారణమవుతోంది. బిచ్చగాళ్లు, మద్యం ప్రియులకు పాత కలెక్టరేట్ భవనం నిలయంగా మారింది. భవనం తూర్పువైపు భారీ చెట్టు కొమ్మలు రెండవ అంతస్తును ఒరుసుకుంటూ ఉండడంతో గాలి వచ్చినపుడు భవనం షన్‌షేడ్‌లు విరిగిపోతున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే భవన నిర్మాణ రాళ్లు కూడా తొలగిపోయే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకరంగా పరిణమించిన చెట్టు కొమ్మలను వెంటనే తొలగించి వీలైనంత వరకు పూర్తి స్థాయిలో భవనానికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు. జిల్లా మ్యూజియంగానో, గ్రామీణ వస్తువుల మ్యూజియంగానో మార్చి భవనాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. పాత కలెక్టరేట్ భవనానికి అవసరమైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే చారిత్రక నిర్మాణాన్ని కాపాడిన వారమవుతామని ..దీన్ని వినియోగించకపోతే శిథిలమయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.